క్లుప్తంగా

మాన్యం భూమిలో ఆక్రమణలు

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులోని ఆంజనేయస్వామి మాన్యం భూమిలో ఆక్రమణలపై దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ ఆదేశాలపై ఆదివారం అధికారులు స్పందించారు. ఈఓ మునిరాజ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఈవో మునిరాజతో కలిసి మాన్యం భూమిలో పరిశీలన చేశారు. భూమిని ఆక్రమించి బంకులు, దుకాణాలు నిర్వహిస్తున్న వారి వద్దకు వెళ్లి ఎవరి అనుమతితో దుకాణాలు పెట్టుకున్నారని ప్రశ్నించారు. తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై ఆక్రమణదారులతో చర్చించిన అనంతరం మూడు రోజుల గడువు ఇచ్చారు. ఆ తర్వాత యంత్రాలతో ఆక్రమణలను తొలగిస్తామని ఈఓ తెలిపారు. లేనిపక్షంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

సన్మానం



సురేంద్రరావ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

పీలేరు : పదవి విరమణ పొందిన పీలేరుకు చెందిన హెచ్ఎం సురేంద్రరావ్‌కు ఘన సన్మానం లభించింది. ఆదివారం ఆయన నివాసం వద్ద పులిచెర్ల శెట్టిపల్లె సిద్ధరామయ్య, పోకల తాతయ్య దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సురేంద్ర రావ్ పీలేరు తోపాటు వివిధ ప్రాంతాలలో ఎమ్మార్సీగా, ఉపాధ్యాయుడుగా ప్రధానోపాధ్యాయుడుగా విశేష సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ వంగిమళ్ల రామచంద్ర, ఉపాధ్యాయులు రాజేంద్ర, పోతంశెట్టి రమేష్, వెంకటసుబ్బయ్య, రహత్‌బాషా, కృష్ణమూర్తి, శెట్టి సుబ్రమణ్యం, కిషోర్‌కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు'

పీలేరు : సంబేపల్లెలో సీఎం సభలో బీటీ కళాశాలను ప్రైవేట్ పరం చేయరాదని తన డిమాండ్ వినిపించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్‌ను అక్రమ అరెస్టుతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాధవ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కొట్టించిన ఎస్సీ విద్యాసాగర్‌నాయుడును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు బలతవంతంగా స్టేషన్‌కు తరలించి చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలను చులకనగా చేసే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీటీ కళాశాల సమస్యపై తాము కూడా న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

డప్పులు కొడుతూ ప్రచారం

బి.కొత్తకోట: మాదిగల వర్గీకరణ కోసం ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న లక్షల గొంతులు–వేల డప్పులు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం బి.కొత్తకోటలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు డప్పు కొడుతూ ప్రచారం నిర్వహించాయి. స్థానిక రంగసముద్రంరోడ్డు డప్పులతో ప్రచారం చేశాక రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నా మాట్లాడుతూ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ విషయంలో ఎస్సీ ఉప కులాలు ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమీషన్‌తో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు, ఎస్సీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు భవానీ వెంకటేష్, చౌడప్ప, సురేంద్ర, గంగులప్ప, నరేంద్ర, మస్తాన్ పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ..చల్లంగ చూడమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మ తల్లీ చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు అమ్మ వారికి మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వేసవి ఎండలు మొదలవడంతో సందర్శకుల తాకిడి మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రకృతి అందాలను తిలకిస్తూ చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. అటవీసముదాయంలో మినిజూ, పార్కులో సందడి నెలకొంది. మానస సరోవరంలో బోటింగ్‌కు సందర్శకులు ఆసక్తి చూపించారు.

మంజునాథ సమస్యలు తీరవా?

- తాగునీటికి కటకట
- విద్యుత్ దీపాలు లేక అంధకారం
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు



మంజునాథకాలనీలో రోడ్డు దుస్థితి



వీధిదీపాలు లేని విద్యుత్‌స్తంభం



అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంకు

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు పరిధిలోని మంజునాథ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. కాలనీలో సుమారు 800 వరకు నివాసాలు ఉన్నాయి. ఈ కాలనీలో చిరు వ్యాపారులు, కూలీలు అధికంగా నివాసమున్నారు. కాలనీలో కనీసం రోడ్డు సౌకర్యం సరిగా లేదు. మట్టి రోడ్లు, గుంతలు దర్శనమిస్తున్నాయి. నడవడానికి కూడా వీలు కాదు. వర్షం వస్తే చాలు గుంతల్లో నీరు నిలిచిపోతుంది. కాలనీలో గుంతలు ఉన్న చోట స్థానికులు మట్టిని తోలించుకుని గుంతలు పూడ్చుకుంటున్నారు. రాత్రి పూట వాహనాలు వెళ్లాలంటే కష్టంగా మారింది. కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇంటి ముందు గుంతలు తవ్వుకున్నారు. వాటిలో మురుగునీరు నిల్వ ఉంచుతున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. దీంతో స్థానికులకు నిత్యం విషజ్వరాల బారిన పడుతున్నారు.

తాగునీటి కష్టాలు

తాగునీటికి కాలనీవాసులు అల్లాడిపోతున్నారు. వీధికుళాయిలు లేవు. ఇళ్లకు చాలా వరకు కుళాయి కనెక్షన్లు లేకపోవడంతో డబ్బులు చెల్లించి ట్యాంకుల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. కాలనీ మొదటిలో ట్యాంకు ఏర్పాటు చేశారు. అది కూడా అలంకారప్రాయంగా మారింది. చేతిబోరులో నీరు రావడం లేదు.

వీధి దీపాలు ఏవీ?

విద్యుత్ స్తంభాలు ఉన్నా వీధిదీపాలు లేకపోవడంతో చీకటిలో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మాత్రం అక్కడక్కడ వీధిదీపాలు వేసి చేతులు దులుపుతున్నారు. వీధుల్లో చెత్తాచెదారం ఎక్కడి పడితే అక్కడ పేరుకుపోతుంది. చెత్తాచెదారం కూడా ఎత్తడం లేదు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద మురుగునీరు రోడ్లపై ప్రవహించి దుర్గంధంగా మారింది.

కనీస సౌకర్యాలు కల్పించాలి



కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి. రోడ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి పూట రావాలంటే చాలా కష్టం. రాత్రి పూట వీధిదీపాలు వెలగడం లేదు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

-రాజేష్,
మంజునాథకాలనీ, ,మదనపల్లె

నీటి సౌకర్యం కల్పించాలి



కాలనీలో నీటి సమస్య అధికంగా ఉంది. నీళ్ల ట్యాంకులతో కొనుగోలు చేస్తున్నాము. మురుగునీటి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తుంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. కాలనీ సమస్యలపై స్పందించాలి.

-కుమారి,
మంజునాథకాలనీ,మదనపల్లె

భూ సమస్యపై మహిళ ఫిర్యాదు

కురబలకోట: మండలంలోని అంగళ్లు ఎంఆర్ఆర్ రైస్ మిల్ పక్కన సర్వే నెంబరు 236లో 59 సెంట్లు భూమిని తుమ్మచెట్లపల్లెకు చెందిన ఇద్దరు ఆక్రమించి చదును చేస్తున్నారని అంగళ్లుకు చెందిన మిట్టపల్లె పార్వతమ్మ స్థానిక రెవెన్యూ అధికారులకు, ముదివేడు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. 2008లో శ్రీనివాసుల రెడ్డి వద్ద 59 సెంట్లు భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత ఇదే భూమిని దురుద్దేశ్యంతో తుమ్మచెట్లపల్లెకు చెందిన ఇద్దరు శ్రీనివాసుల రెడ్డి వారసుల వద్ద రాయించుకున్నారని తెలిపారు. ఇటీవల ఈ భూమిలోకి ప్రవేశించి మట్టి తోలి చదును చేసే పనులు చేపట్టారన్నారు. అంతేగాకుండా సదరు భూమిపై మదనపల్లె ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 2023లో పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ కూడా మంజూరు చేసినట్లు బాధితురాలు పార్వతమ్మ తెలిపింది. అధికారులు రికార్డులు పరిశీలించి ఆపై విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

కనుల పండువగా నాగ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి పంచాయతీ కొత్తపల్లిలో ఆదివారం నాగ ప్రతిష్టను కనుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు వేద పండితులచే ఆలయంలో గణపతి పూజ, గంగ పూజ, గోపూజ, జలాధివాసం, క్షీరాధివాసం, నిద్రాకలశ స్థాపన లాంటి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

– పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల



ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, తదితరులు

కలికిరి: ఫీజురీయింబర్స్ మెంటు నిధులు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తు అంధకారం చేసిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు జరిగిన అన్యాయంపై ఈ నెల 5న అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట పెండింగ్‌లో టున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు పోస్టర్లను ఆదివారం వాల్మీకిపురంలోకి వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. గతంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్యావ్యవస్థకు పెట్టపీట వేసి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం అందకుండా కుట్రలు పన్నుతోందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు మంగళం పాడటంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా లక్షలాది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారన్నారు. పేద విద్యార్థులకు న్యాయం జరగాలన్నా.. విద్యాభివృద్ధి సాధ్యమవ్వాలన్నా వైఎస్ఆర్‌సీపీతోనే సాధ్యమని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు శ్రీధర్‌రాయల్, మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, నరసింహులు, ఇబ్రహీం, సురేష్‌రెడ్డి, శివారెడ్డి, మునిభాస్కర్, రవి, మహమూబ్ బాషా, చికెన్ మస్తాన్, పైపుల్లా, చలపతి, శ్యామ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చెన్నకేశవులు

కేవీపల్లె : వందశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు అన్నారు. ఆదివారం గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ 31వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, పూర్వ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ చందాలతో విద్యార్థుల సౌకర్యార్థం ఒక టాయిలెట్ బ్లాక్‌ను నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్స్ జి. నారాయణమ్మ, శివయ్య, శ్రీధర్, చంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం

పీలేరురూరల్ : పీలేరులో గత నెలలో జరిగిన విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశంలో ప్రస్తావించిన సమస్యల్లో భాగంగా శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం అయిందని జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు బోదేషా వల్లి తెలిపారు. ఆదివారం స్థానిక పటేటల్ వీధిలో ఏళ్ల తరబడి పరిష్కారం కానీ శిథిలావస్థకు చేరిన కరెంటు స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ ఖాదర్ ఇలాహి స్పందించి సమస్య పరిష్కరించడం అభినందనీయమన్నారు.

నేటి నుంచి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఆలయ ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్ తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో, చలువ పందిళ్లలతో ఆకర్షణీయంగా, రంగవళ్లలతో ముస్తాబు చేశారు. ఆగమ సలహాదారు సలహా మేరకు సోమవారం సాయంత్రం అంకుర్పారణ కార్యక్రమంలో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 4న ధ్వజారోహణం, పల్లకీ ఉత్సవం, 5న శేషవాహనం, హంసవాహనం, 6న ముత్యపుపందిరి వాహనం, సింహవాహనం, 7న కల్పవృక్షవాహనం, హనుమంతవాహనం, 8న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 9న సర్వభూపాల వాహనం, కళ్యాణోత్సవం, 10న రథరోహణ గజవాహనం, రథగమనం, 11న పల్లకి ఉత్సవం,అశ్వవాహనం, 12న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజాఅవరోహణం, 13న స్నపన తిరుమంజనం,పుష్పయాగం కార్యక్రమాలతో బ్రహోత్సవాలు ముగుస్తాయన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి అభినందనలు

రామసముద్రం : అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడుగా నియమితులైన జెడ్పీటీసీ సిహెచ్. రామచంద్రారెడ్డికి ఆదివారం ఆయన నివాసంలో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామమైన రామసముద్రం మండలాన్ని గుర్తించి జిల్లా స్థాయిలో పదవి కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పదవి కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ నిసార్ అహమ్మద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, కేశవరెడ్డి, నాగరాజస్వామి, సుజ్ఞాన మూర్తి, షంషీర్, ఉదయ్ శంకర్ రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, ప్రకాష్, రెడ్డి వీరేగౌడు, కృష్ణప్ప, శివ, అంబరీష్, నరసింహులు, భాస్కర్, జికె. చంద్ర, బోస్, నాగరాజ, రాజన్న, ఈశ్వర్ రెడ్డి, సర్దార్, దొరస్వామి, రాధా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ఇస్కఫ్ రాష్ట్ర మహాసభలు



ప్రసంగిస్తున్న ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్

మదనపల్లె : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర మహాసభలు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఏప్రిల్ 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన ఇస్కఫ్ జిల్లా రెండో మహాసభలో ఆయన మాట్లాడుతూ... జాతీయ గీతం జనగణమణ ఆంగ్లంలోకి అనువాదం జరిగిన, ప్రముఖ తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి జన్మస్థలమైన మదనపల్లెలో ఇస్కఫ్ రాష్ట్ర మహాసభలు జరపాలని నిర్ణయించిన జిల్లా అధ్యక్షులు డీవి.రమణ, ప్రధాన కార్యదర్శి జీవి.శివకుమార్లను అభినందించారు. రవీంద్రనాథ్ సోదరుడు దేవేంద్ర నాథ్ టాగోర్ 83 ఏళ్ల క్రితం మొదలైన ఇస్కఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరని రాజశేఖర్ గుర్తు చేశారు. సంస్కృతిని కాపాడుకోవడం అంటే మన మూలాలను గుర్తించడమే కాదని, కొత్త తరాలకు దాని విలువలను బోధించడం కావాలని కాగితాల రాజశేఖర్ అన్నారు. స్నేహం అనేది మనిషిని అసలైన మానవతావాదిగా మారుస్తుందన్నారు. దేశంలో విభిన్న భాషలు, మతాలు, సంప్రదాయాలు ఉన్నా మనం స్నేహబంధంతో ఉంటే సమాజం మరింత బలంగా ఉంటుందని, సమాజాన్ని కలుషితం చేస్తున్న మతతత్వ శక్తులను ఇస్కఫ్ వ్యతిరేకిస్తోందన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి తుంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ సంస్థ బలోపేతానికి ప్రధానంగా మేధావులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి ముందు ప్రజా కళాకారుడు ఆర్.వేమనారాయణ ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, పట్టణ కార్యదర్శి మురళి, దళిత హక్కుల పోరాట సమితి కిష్టప్ప, మాజీ కౌన్సిలర్ శేషాచలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు క్రిష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, క్రిష్ణంరాజు, ధనుష్‌లు సంప్రదాయబద్ధంగా మంత్రోయచ్ఛారణలతో ఉదయం చతుష్టార్చన, మధ్యాహ్నం నేఘత్రోవలమలనం, ఛాయాదివసం, సాయంత్రం చతుష్టార్చన పంచఛాయదివసాలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఆలయ సూపరింటెంట్ మునిబాలకుమార్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటేష్ సేవలు ప్రశంసనీయం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న తొగటవీరక్షత్రియ సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: బీసీ సంక్షేమ వసతిగృహ అధికారి ఎం.వెంకటేష్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర తొగటవీరక్షత్రియ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో మదనపల్లె పట్టణం నక్కలదిన్నె వసతిగృహం వార్డన్ వెంకటేష్ ఉత్తమ వసతిగృహ అధికారిగా ప్రశంసపత్రం అందుకున్నందుకు ఘనంగా సన్మానించారు. ఉద్యోగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొగలవీరక్షత్రియ సంఘ అభివృద్ధికి తన వంతు సహాయ,సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవత సంస్థ ద్వారా పట్టణంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనకు ఉత్తమ అధికారిగా అవార్డు రావడంతో ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చౌడేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్,జిల్లా అధ్యక్షులు వెంకటనారాయణ, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, మోదం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బీసీ సంక్షేమ కార్యాలయంలో బీసీ సంఘ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వార్డన్ వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు.

సేవచేసే భాగ్యం దేవుడిచ్చిన వరం



సభలో మాట్లాడుతున్న ఉపేంద్రరెడ్డి

కేవీపల్లె : ప్రజలకు సేవచేసే భాగ్యం దేవుడిచ్చిన వరమని అమెరికాలో ఉంటున్న వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, ఉపేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో అమెరికాలో స్థిరపడ్డ వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, వంగిమళ్ల ప్రసాద్‌రెడ్డి సౌజన్యంతో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహించారు. ఆదివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు చెన్నై శంకర్‌నేత్రాలయం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కంటి శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి ఇక్కడే ప్రత్యేక బస్సులో కంటి ఆపరేషన్లు చేసి వైద్యం అందిస్తారు. వైద్యశిబిరం ప్రారంభోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ శంకర్ నేత్రాలయ దేశంలోనే ప్రసిద్ధి చెందిన హాస్పిటల్ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. వారు ఇక్కడికి వచ్చి వైద్య శిబిరం, శస్త్ర చికిత్స నిర్వహించడం అభినందనీయం. కంటి శస్త్ర చికిత్సలకు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా రోగులకు ఇక్కడే శస్త్ర చికిత్స చేసే సౌకర్యం కల్పించామని తెలిపారు. సొంత ఊరిపై మమకారంతో ప్రతి ఏటా సేవా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. రోగులకు కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు, ఇక్కడే ఉండడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు 100 మందికిపైగా కంటి పొర పరీక్షలుఏ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, పొత్తపు సతీష్ రెడ్డి, శంకర్‌నేత్రాలయ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ టీచర్‌కు జాతీయ స్థాయి అవార్డు



జ్ఞాపిక అందుకుంటున్న ఉపాధ్యాయుడు మహమ్మద్‌ఖాన్

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు టీచర్‌గా పని చేస్తున్న పి.మహమ్మద్‌ఖాన్‌కు జాతీయ స్థాయి ఆషిఖ్–ఏ–రసూల్ అవార్డు ఆభించింది. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరులో ఆదివారం జరిగిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. తమిళనాడు అంజుమన్–ఏ–మొహిబ్బాన్–ఏ–ఉర్దూ సంస్థ అధ్యక్షులు సయ్యద్ మజహర్ పీరా, కార్యదర్శి అన్వర్ ఖాదరీలు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మహమ్మద్‌ఖాన్ ఉర్దూ సాహితీ సేవలు కొనియాడారు. అనంతరం దుశ్శాలువ కప్పి జ్ఞాపికతో సత్కరించారు.

దండు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమోఘం

– వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



ఉచిత వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న నిసార్‌అహ్మద్, ఎన్ఆర్ఐ శేఖర్‌రెడ్డి

మదనపల్లె : మండలంలోని పెంచుపాడు పంచాయతీలో దండు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ దండుశేఖర్‌రెడ్డి చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. ఎన్ఆర్ఐ దండుశేఖర్‌రెడ్డి కుమారుడు మౌనిష్‌రెడ్డి దండు మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పెంచుపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై ఉచిత వైద్యసేవలను వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి ఆధ్వర్యంలో వైద్యబృందం రోగులను పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...పుట్టినరోజు సందర్భంగా వేడుకల పేరుతో లక్షల రూపాయలు విందులు, వినోదాలకు ఖర్చుచేయకుండా సేవాకార్యక్రమాలు నిర్వహించడం గొప్ప నిర్ణయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మనసున్న ప్రతి ఒక్కరూ ఏర్పాటుచేసి సమాజసేవకు తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం మౌనిష్‌రెడ్డి దండు జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించి, దండు కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెంచుపాడు, బొమ్మనచెరువు, అంకిశెట్టిపల్లె సర్పంచులు మనోహర్, దండు కరుణాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, నాయకులు నాగరాజరెడ్డి, తట్టి నాగరాజరెడ్డి, మహమ్మద్ యూనిస్, మజ్జిగకేశవ, కొత్తపల్లె మహేష్, చరణ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కన్నెమడుగు, వాల్మీపురం జట్ల మధ్య హోరాహోరీ పోరు

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వశిష్ట పాఠశాలలో ఖేల్ ఇండియా అస్మిత అండర్–17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. వశిష్ట స్కూల్, చెంబకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల మధ్య జరిగిన పోటీల్లో 1–0 స్కోరుతో వశిష్ట స్కూల్ విజయం సాధించింది. వేదా స్కూల్, మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలల మధ్య జరిగిన పోటీల్లో 2–0 స్కోరుతో వేదా స్కూల్ గెలుపొందింది. కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల, వాల్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల మధ్య జరిగిన పోటీల్లో 1–0 స్కోరుతో కన్నెమడుగు జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వశిష్ట స్కూల్ చైర్మన్ పీవిఆర్‌గుప్తా, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, కోచ్ మహేంద్ర, పీడీలు నరేష్‌బాబు, ఖాదర్‌బాషా, ఆసిఫ్, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–93 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దాదాపు 32 ఏళ్ల తరవాత వారంతా కలుసుకున్నారు.

పూర్వపు విద్యార్థులు అమర్‌నాథ్ తమ స్నేహితుల ఫోన్ నంబర్లు సేకరించారు. అందరూ కలిసి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తమకు పాఠాలు నేర్పిన గురువులు సుభాషిణి, శ్యామలమ్మ, అలివేలమ్మ, అమరావతి, హీరాజిరావు, శ్రీనివాసరావు, ఈశ్వరయ్య, శ్రీనివాసులునాయుడు, రాజారెడ్డి,సుదా, కృష్ణమూర్తి, సూర్యకుమారిలను పాదాభివందనం చేసి సన్మానించారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని అప్పటి రోజులు గుర్తుకు తెచ్చుకున్నారు.